

అనారోగ్యంతో ఏనుగు మృతి

గరుగుబిల్లి, జూన్ 25: గరుగుబిల్లి మండలం సంతోషపురం, తోటపల్లి ఆనుకుని ఉన్న పామాయిల్ తోటలో ఒక ఏనుగు (మహాలక్ష్మి) మంగళవారం మృతి చెందింది. ఈ సమాచారం తెలుసుకున్న డీఎఫ్‌వో జి.ప్రసూన, రేంజ్ అధికారి మణికంఠేష్‌మణి హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మృతి చెందినది ఆడ ఏనుగుగా గుర్తించారు. ప్రస్తుతం అది గర్భంతో ఉన్నట్లు సమాచారం. కాగా తోటపల్లి ప్రాంతంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. చనిపోయిన ఏనుగును అక్కడే పూడ్చిపెట్టారు. గరుగుబిల్లి పోలీస్ సిబ్బంది ఈశ్వరరావు, అచ్చుతరావులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై డీఎఫ్‌వో మాట్లాడుతూ కొద్ది రోజులుగా ఏనుగు ఆరోగ్య పరిస్థితి బాగోలేదన్నారు. విశాఖ జూకు చెందిన వైద్య సిబ్బందితో అవసరమైన వైద్య సేవలు అందించామని తెలిపారు. ఏనుగు మృతిపై అవసరమైన నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఏనుగుల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం జిల్లాలో పది ఏనుగులు సంచరిస్తున్నాయని సంరక్షణ విభాగం రేంజర్ మణికంఠేష్ తెలిపారు. కాగా ఏడు గజరాజుల గుంపు కొద్ది రోజులుగా గరుగుబిల్లి మండలంలో సంచరిస్తుండగా.. తాజా ఘటనతో వాటి సంఖ్య ఇప్పుడు ఆరుకు చేరింది. ఈ ప్రాంతంలో మృతి చెందిన ఏనుగుల సంఖ్య ఐదుకు చేరుకుంది.


తోటపల్లి సమీపంలో మృతి చెందిన ఏనుగు

గజరాజుల ప్రాణాలు పోతున్నాయ్!

పార్వతీపురం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి)/కొమరాడ

● ఆచరణలోకి రాని సంరక్షణ ప్రతిపాదనలు ● ఏనుగుల జోన్ ఏర్పాటు గాలిలోనే.. ● గత ఐదేళ్లలో స్పందించని వైసీపీ సర్కారు

జిల్లా సమారు దశాబ్దన్నర కాలంగా సంచరిస్తున్న ఏనుగులకు రక్షణ కొరవడింది. దీంతో వాటి మనుగడకే ముప్పు ఏర్పడింది. అయినా యంత్రాంగానికి చీమ కుట్టినట్లైనా లేదు. దశాబ్దాల తరబడి ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపేవారు లేరు. అటవీశాఖ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవడంతో ప్రజలు, గజరాజుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మంగళవారం గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామ సమీపంలో అనారోగ్యంతో మహాలక్ష్మి అనే ఆడ ఏనుగు మృతి చెందింది. దీంతో అధికారుల పనితీరు మరోసారి చర్చనీయాంశమైంది. పరిస్థితి ఇంత ఆందోళనకరంగా ఉన్నా.. గత ఐదేళ్లలో వైసీపీ సర్కారు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఏనుగుల జోన్ ఏర్పాటు, తరలింపు తదితర అంశాలను పట్టించుకోలేదు. కనీసం గజరాజుల సంరక్షణపై దృష్టి సారించలేదు. ఫలితంగా ఏనుగులు మృత్యువాత పడుతున్నాయి.

ఒడిశా నుంచి జిల్లాలోకి..

అప్పటి శ్రీకాకుళం జిల్లా నుంచి విజయనగరం జిల్లా మీదుగా 2007లో తొమ్మిది ఏనుగులు ప్రవేశించాయి. పొరుగున ఉన్న ఒడిశా రాష్ట్రం లఖేరీ అటవీ ప్రాంతం నుంచి తొలిసారి సీతంపేట మండలంలోకి ప్రవేశించాయి. అప్పటి నుంచి ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లాల్లో సంచరిస్తున్నాయి. 2017లో ఒడిశా మీదుగా మరో ఎనిమిది ఏనుగుల గుంపు అప్పటి విజయనగరం జిల్లాలోకి ప్రవేశించింది. గతేడాది మరో ఆరు ఏనుగుల గుంపు భామిని మండలంలోకి వచ్చాయి. అయితే వచ్చిన కొద్ది రోజులకే విద్యుత్ షాక్‌తో నాలుగు మృతి చెందడంతో మిగిలిన రెండు ఏనుగులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో రెండు గుంపులు ప్రస్తుతం శ్రీకాకుళం, మన్యం జిల్లాల పరిధిలో సంచరిస్తున్నాయి.


భామిని మండలంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఏనుగులు (ఫైల్)

ఇక్కడే ఎందుకు..?

ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలో విస్తారంగా అడవులు, అనువైన ప్రాంతాలు ఉండటంతో ఏనుగుల గుంపులు ఇక్కడే తిష్ట వేశాయి. నదులు కారణంగా పుష్కలంగా తాగునీరు, ఆహారంగా వరి, చెరుకు, మొక్కజొన్న, మామిడి, పనస, జీడి పంటలు అందు బాటులో ఏడాది పాటు ఉండడంతో ఈ ప్రాంతాన్ని విడవడం లేదు. ఇప్పటివరకు వేలాది ఎకరాల్లో ఏనుగుల గుంపు వల్ల రైతుల పంటలకు నష్టం వాటిల్లింది.

రంగంవలస కొండపై ..

సీతంపేట: మర్రిపాడు పంచాయతీ పరిధిలో ఉన్న రంగంవలస కొండపై నాలుగు ఏనుగులు సంచరిస్తున్నట్లు పాలకొండ అటవీశాఖ రేంజర్ తవిటినాయుడు తెలిపారు. కొంతకాలంగా భామిని మండల తాలాడ, బాలేరు సమీపంలో అవి తిరిగేవన్నారు. ప్రస్తుతం కొండపై పుష్కలంగా ఆహారం లభించ డం వల్ల ఏనుగులు అక్కడికి చేరినట్లు ఆయన చెప్పారు. వాటిని తమ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

వివిధ కారణాలతో..

ఒడిశా సరిహద్దుల మీదుగా వచ్చిన మూడు గుంపుల్లోని ఏనుగులు వివిధ కారణాలతో మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటివరకు 11 ఏనుగులు చనిపోయాయి. అంటే వీటిపై పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 2007లో తొలి ఏనుగుల గుంపులో రెండేసి ఒడిశాలోని లఖేరీ అటవీ ప్రాంతంలోకి తరలించారు. తరువాత 2010లో ఆపరేషన్ గజా పేరిట శిక్షణ పొందిన గజరాజులతో ఇక్కడున్న రెండింటికి మత్తు మందు ఇచ్చి తరలించే ప్రయత్నం చేశారు. ఒడిశా చేరిన తరువాత ఒకటి మరణించింది. దీంతో ఒడిశా ప్రభుత్వం తరలింపు ప్రక్రియకు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆపరేషన్ గజా నిలిచిపోయింది. అనంతరం గుంపులో మరో రెండు ఏనుగులు వీరఘట్టాం మండలం కుండిబిచ్చపురం వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. ఎస్.గోపాలపురం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి మరొకటి మరణించింది. 2017లో విజయనగరం జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపులో అర్తాం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి ఒకటి చనిపోయింది. 2018లో దుగ్గి వద్ద నాగావళి నది ఊబిలో చిక్కుకొని ఒక ఏనుగు ప్రాణాలు విడిచింది. మరికొన్ని రోజులకు జియ్యమ్మవలస మండలంలో కాట్రగడ్డ సమీపంలో విద్యుత్ షాక్‌తో నాలుగు ఏనుగులు మృత్యువాత పడ్డాయి. కురుపాం మండలం పల్లంబారిడిలో , గుమ్మలక్ష్మీపురం మండలం ఇరిడి గడ్డ వద్ద, కొమరాడ మండలం అర్తంలో విద్యుత్‌షాక్‌తో గజరాజులు చనిపోయాయి.

● భామిని మండలం నేరడి బారేడు, కాట్రగడ మధ్యలో విద్యుత్ షాక్‌కు గురై 2023లో ఒకేసారి నాలుగు ఏనుగులు చనిపోయాయి. ఈ విషయం నాటి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. జిల్లాలో ఏనుగులు జోన్ ఏర్పాటు చేస్తామని ప్రకటనలకే పరిమితమయ్యారు. జోన్ కోసం అధికారులు స్థలాలు పరిశీలించి వెళ్లిపోయారు.

● ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించేందుకు సుమారు రూ.40 నుంచి రూ.50 కోట్లు అవసరమని అటవీశాఖాధికారులు చెప్పినా.. గత వైసీపీ సర్కారు స్పందించలేదు.

● గతంలో సాలూరు మండలం తదితర చోట్ల ఏనుగులు చనిపోయినా.. జిల్లాలో వన్యప్రాణుల రక్షణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

● నిన్నమొన్నటి వరకు భామినిలో నాలుగు, గురుగుబిల్లి, జియ్యమ్మవలస పరిసర ప్రాంతాల్లో ఏడు గజరాజులు సంచరించేవి. గరుగుబిల్లి ఘటనతో ఈ ప్రాంతంలో ఏనుగుల సంఖ్య ఆరుకు చేరింది. ప్రస్తుతం జిల్లాలో గజరాజుల సంఖ్య పదికి చేరింది. కాగా వాటి రక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోకుంటే.. భవిష్యత్‌లో మరిన్ని ఏనుగులు చనిపోయే అవకాశం ఉందని జంతు ప్రేమికులు, పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. దీనిపై అటవీశాఖ ఉన్నతాధికారులు, నూతన ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఏనుగుల జోన్ ఏర్పాటుపై దృష్టి సారించాల్సి ఉంది.

● ప్రతిపాదనలు కాగితాల్లో...

ఏనుగులు రాష్ట్రంలోకి ప్రవేశించిన నాటి నుంచి అటవీశాఖ అధికారులు పలు రకాల ప్రతిపాదనలు చేశారు. తొలిసారి చేపట్టిన ఆపరేషన్ గజా ఆదిలోనే నిలిచిపోయింది. మైదాన ప్రాంతాల్లోకి రాకుండా ఉండేందుకు కందకాలు ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందుకోసం పాలకొండ మండలం గుడివాడ సమీపంలో పనులు ప్రారంభించగా గిరిజనులు అడ్డుకోవడంతో ఈ ప్రతిపాదన విరమించుకున్నారు. పార్వతీపురం సమీపంలో జంతికొండ వద్ద ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదికలు అందించారు. అక్కడ నుంచి ఎలాంటి స్పందన లేదు. ఏనుగుల గుంపును జంతు ప్రదర్శనశాలకు తరలించే యోచన అధికారులు చేశారు. అది కూడా కార్యరూపం దాల్చలేదు. ఇదిలాఉండగా ఒంటరి ఏనుగు జాడ గత ఆరు నెలలుగా కనిపించడం లేదు. ఈ ఏనుగు సమీపంగా ఉన్నది లేనిది కూడా అటవీశాఖ అధికారులు ధ్రువీకరించలేని పరిస్థితి ఉంది. దీంతో ఒక ఏనుగు తప్పిపోగా, 12 ఏనుగులు మృత్యువాత పడ్డాయి. 18 మంది ఏనుగుల దాడిలో ఇప్పటివరకు మృతి చెందారు.


సిబ్బందితో మాట్లాడుతున్న దృశ్యం

జ్వరాల అదుపునకు చర్యలు

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి

గుమ్మలక్ష్మీపురం, జూన్ 25: సీజనల్ జ్వరాలు అదుపులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె.విజయపార్వతి ఆదేశించారు. గుమ్మలక్ష్మీపురం(భద్రగిరి) సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంవో టి.జగన్మోహన్‌రావుతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. రోజూ జ్వర లక్షణాలతో ఎంతమంది వస్తున్నారు.. ఏ విధమైన జ్వరాలు గుర్తిస్తున్నారు.. వారికి అందిస్తున్న చికిత్స ఏమిటి?.. తదితర అంశాలపై ఆరా తీశారు. మలేరియా నిర్ధారణకు సకాలంలో పరీక్షలు జరపాలని ఆదేశించారు. ప్రసూతి గది, రక్తనిధి కేం ద్రం, వార్డులను తనిఖీ చేశారు. ఈ పరిశీలనలో ఆసుపత్రి సూపరిటెండెంట్లు శోభారాణి, త్రివేణి, వైద్యాధికారి హర్ష, ఏఎంవో సూర్యనారాయణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెలవులో సాలూరు మునిసిపల్ కమిషనర్

సాలూరు, జూన్ 25: సాలూరు మునిసిపల్ కమిషనర్ పి.ప్రసన్నవాణి సోమవారం నుంచి సెలవుపై వెళ్లినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆమె 15 రోజుల పాటు సెలవు పెడుతున్నానని సోమవారం కలెక్టర్‌కు చెప్పినట్లు సమాచారం. ఈ విషయంపై మునిసిపల్ మేనేజర్ రాఘవాచార్యులను వివరణ కోరగా.. 'కలెక్టర్‌ను కలిసిన అనంతరం కమిషనర్ సెలవుపై వెళ్లారు. ఇన్‌చార్జిగా ఎవరు వ్యవహరిస్తారనే విషయంపై స్పష్టత లేదు. కమిషనర్ సెలవు పెట్టిన విధానం సరిగా లేదు. ఉన్నతాధికారుల నుంచి పూర్తిస్థాయిలో స్పష్టత రావాల్సి ఉంది' అని తెలిపారు.

ఏజెన్సీలో భారీ వర్షం

● ఉప్పొంగిన గెడ్డలు, వాగులు
● రాకపోకలకు అంతరాయం

సాలూరు రూరల్, జూన్ 25: జిల్లాలోని సీతంపేట, సాలూరు ఏజెన్సీలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎక్కడిక్కడే వర్షపు నీరు నిలిచిపోయింది. గెడ్డలు, వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో గిరిజనులు రాకపోకలు సాగించలేకపోయారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వాన పడింది. ఏవోబీలో ఒడిశా కొండల్లో సైతం వర్షం కురవడంతో కొండ వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. వంతెనలపై వరదనీరు ప్రవహించడంతో గంటల పాటు గిరిజన గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం ఖరీఫ్‌కు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వారు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా వాతావరణం చల్లబడడంతో ఉక్కబోత నుంచి జనం కాస్త ఉపశమనం పొందారు.


పాచిపెంట మండలం వేటగానివలస వద్ద ఉప్పొంగిన కొండగెడ్డను దాటుతున్న గిరిజనులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

ఎన్నికల్లో సిబ్బంది పనితీరు భేష్

● ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో అధికారులు, సిబ్బంది పనితీరు భేష్ అని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో మాసాంతర నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అందరి సమష్టి కృషితోనే సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగాయని తెలిపారు. 'ఎన్నికల కమిషన్, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో అధికారులు, సిబ్బంది ఎప్పటి కప్పుడు గ్రామాలను సందర్శించి ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. హోంగార్డు నుంచి అధికారుల వరకూ ఆత్మస్థైర్యంతో పని చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా బాగా కష్టపడి పని చేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో పనిచేయాలని' ఎస్పీ సూచించారు. అనంతరం గతంలో నమోదైన కేసులు, వాటి దర్యాప్తులో సాధించిన పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించిన ఏఎస్పీలు దిలీప్‌కిరణ్, సునీల్‌షరోన్, దిశ, పాలకొండ, ఎస్సీ, ఎస్టీ సెల్, ఏఆర్ డీఎస్పీలు ఎస్.ఆర్.హర్షిత, జీవీ కృష్ణారావు, జి.మురళీధర్, ఎస్.వెంకటప్పారావుతో పాటు పలువురు సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బందిని ఎస్పీ సన్మానించి ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందించారు.

మూతబడి

● విద్యార్థులు లేక పాఠశాలలకు తాళాలు


గరుగుబిల్లి మండలం మరుపెంట పంచాయతీ సాంబన్నవలస, తులసిరామినాయుడువలసలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. పూర్తిస్థాయిలో భవనాలు ఉన్నా.. విద్యార్థులు లేని కారణంగా ఆ రెండు నిరుపయోగంగా మారాయి. ఆయా గ్రామాల్లో అత్యధిక విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తుండడంతో.. కొన్నాళ్లుగా ఆయా ప్రభుత్వ పాఠశాలలను ఒకరిద్దరు చొప్పున పిల్లలతో నెట్టుకొస్తున్నారు. సాంబన్నవలసలో ఇద్దరు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేవారు. అయితే ఈ ఏడాది ఆ విద్యార్థులు కూడా లేకపోవడంతో పాఠశాలకు తాళం వేశారు. ఇక తులసిరామినాయుడువలసలో నలుగురు విద్యార్థులు ఈ ఏడాది ప్రైవేట్ స్కూల్‌కు వెళ్లిపోయారు. దీంతో ఆ పాఠశాల కూడా మూతపడింది. డిప్యూటేషన్‌పై అక్కడ పనిచేసిన టీచర్ యథాస్థానానికి చేరుకున్నారు. దీనిపై ఎంఈవో ఎన్.నాగభూషణరావును వివరణ కోరగా.. విద్యార్థులు లేపోవడంతో ఆయా పాఠశాలలు మూతపడ్డాయి. అక్కడున్న ఉపాధ్యాయులను వేరొక పాఠశాలకు నియమించాం. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పుస్తకాలు, భోజనం తదితర వాటిపై గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం' అని ఆయన తెలిపారు. బడుల్లో విద్యార్థుల చేరికలపై దృష్టి సారించామని వెల్లడించారు.

– గరుగుబిల్లి


సాంబన్నవలసలో పాఠశాల ఇలా..

వైసీపీ కార్యాలయానికి నోటీసులు

పార్వతీపురం, జూన్ 25(ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా పార్వతీపురంలో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయానికి మంగళవారం మున్సిపల్ అధికారులు నోటీసులు అంటించారు. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై విస్తృత చర్చ జరిగింది. దీంతో సంబంధిత అధికారులు మేలుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇంద్రభవనాన్ని తలపించేలా నిర్మించిన వైసీపీ కార్యాలయం గోడకు నోటీసులు అంటించారు. వాస్తవంగా పార్వతీపురంలో సర్వే నెంబర్ 458 పార్ట్-2లో ఎకరా 18 సెంట్ల విస్తీర్ణంలో వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణం చేపట్టారు. ఏడాదికి ఎకరాకు వెయ్యి రూపాయల లీజు రూపంలో చెల్లించే ఒప్పందం మీద.. రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని కేటాయించారు. అయితే వైసీపీ నేతలు అనుమతులు పొందకుండానే నిర్మాణం ప్రారంభించారు. కాగా గత ఐదేళ్లూ కళ్లు మూసుకుని వైసీపీ సర్కారుపై స్వామి భక్తిని చాటుకున్న అధికారులు.. ఎట్టకేలకు స్పందించారు. వైసీపీ కార్యాలయానికి నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం మారితే గాని వారిలో స్పందన రాలేదన్న వ్యాఖ్యలు సర్వత్రా వినిపించాయి.



వైసీపీ కార్యాలయానికి నోటీసులు అంటించిన మున్సిపల్ సిబ్బంది

ఒక వస్తువుని ఉత్పత్తి చేయడం ఎంత ముఖ్యమో, దానిని అంతే భద్రంగా వినియోగదారుడికి చేర్చడం కూడా ప్రధానమే. ఈ ప్రక్రియలో కూడా ఎంతో మంది పాల్గొంటారు. అందులో ప్యాకేజింగ్ ముఖ్యమైనది. వస్తువు స్వరూప స్వభావాలను అనుసరించి అవసరమైన విధంగా అట్టపెట్టె లేదంటే మరొకదానిలో పెట్టాలి. భద్రంగా దానిని వినియోగదారుడి ఇంటికి లేదంటే తను సందర్శించే షాపు వద్దకు చేర్చాలి. ఈ ప్రాసెస్ మొత్తం ప్యాకేజింగ్ కిందకు వస్తుంది. ఈ రంగంలో ప్రాథమిక కోర్సు 'డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ'. హైదరాబాద్ రామంతపూర్‌లో ఉన్న జెఎన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో ఈ కోర్సు ఉంది.



విలక్షణ కోర్సు ప్యాకేజింగ్ టెక్నాలజీ

గ్రామాలు లేదంటే సమీప వ్యవసాయ క్షేత్రాల నుంచి పట్టణాలకు వెదురు బుట్టలు, తాటాకు తట్టల్లో కూరగాయలు, పండ్లు వస్తుంటాయి. జనుము సంచీల్లో బియ్యం రవాణా అవుతుంది. అయితే సాంకేతిక పురోభివృద్ధితో ప్యాకేజింగ్ అక్కడితో ఆగలేదు. ఒక హోటల్ నుంచి వండిన ఆహార పదార్థం, ఒక ఫార్మా కంపెనీ నుంచి పలు రకాల మందులు డిస్ట్రిబ్యూటర్‌కు చేరుకోవడం మొదలుకుని రకరకాల వస్తువులు ఆన్‌లైన్‌లో పొందే అవకాశం నేడుంది. ఆ క్రమంలో వస్తువు చెడిపోకుండా వినియోగదారుడికి చేర్చే ప్రక్రియకు సాంకేతికతను జోడించారు. దానిని పటిష్ఠంగా అమలు చేసేందుకు ప్యాకేజింగ్ ప్రధాన ఊతంగా మారింది. దేశీయంగా మధ్యతరగతి ఎదుగుదల, వ్యవస్థీకృత రీటైల్ రంగ విస్తరణ, ఎగుమతుల్లో పెరుగుదల ఫలితంగా ఈ కామర్స్ బలపడింది. అది సహజంగానే ప్యాకేజింగ్ పెరుగుదలకు దోహదపడింది. కొవిడ్ సంక్షోభం ఊహించని పెనుముప్పు. అయితే, ప్యాకేజింగ్ పరిశ్రమకు మాత్రం మంచి ఊపునిచ్చింది. ఒక పక్క ఔషధ పరిశ్రమ, మరోపక్క ఇంటికే నేరుగా డెలివరీలతో ప్యాకేజింగ్ పరిశ్రమ అవసరం బాగా పెరిగింది. ఆహారం నుంచి అవసరమైన వస్తువు వరకు ఏదైనా సరే, తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటికే తెప్పించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది.

కోర్సుగా: హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ఉన్న జెఎన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ మాత్రమే ఈ కోర్సును ఆఫర్ చేస్తోంది. ఈ కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. 1996లో దీన్ని ఇక్కడ ఆరంభించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ ఒక్క పాలిటెక్నిక్ మాత్రమే ప్యాకేజింగ్ టెక్నాలజీలో డిప్లొమాను అందిస్తోంది. గ్రామీణ, పేద విద్యార్థులకు ఈ కోర్సు నిజంగా వరమని చెప్పాలి. అత్యంత ప్రతిభావంతులైన ఫ్యాకల్టీ ఈ కోర్సును తీర్చిదిద్దడం నుంచి తమ విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్ కల్పించేందుకు తద్వారా వారు ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. కోర్సులో భాగంగా ప్యాకేజింగ్ మెటీరియల్ బేసిక్స్, మెథడాలజీ, డిజైన్, అప్లికేషన్ వంటి విషయాలన్నీ బోధిస్తారు. చివరి సెమిస్టర్‌లో సంబంధిత కంపెనీకి పంపి ప్రాక్టికల్‌గా అవగాహన కల్పిస్తారు.

ఉన్నత చదువులు

- ఈసెట్‌లో ర్యాంక్ సాధించి లేటరల్ ఎంట్రీ కింద బీటెక్‌లో చేరవచ్చు. మెకానికల్, ఏరోనాటికల్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ సీఎస్ఇ, ఐటీ బ్రాంచీల్లో చేరవచ్చు.
- హరియాణా రాష్ట్రం హిస్సార్‌లోని గురు జంబేశ్వర్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అలాగే హర్యానా సెంట్రల్ యూనివర్సిటీ ప్రింటింగ్ అండ్ ప్యాకేజింగ్ టెక్నాలజీలో బీటెక్ కోర్సును అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ సహకారంతో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ప్యాకేజింగ్‌లో ఎమ్మెస్సీ, ఐఐటీ రూర్కీ, ప్యాకేజింగ్ టెక్నాలజీలో ఎంటెక్ అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ నేరుగా ప్యాకేజింగ్‌లో సర్టిఫికెట్, పీజీ డిప్లొమా ఆఫర్ చేస్తోంది.

ఉపాధి: ప్రొడక్ట్ డెలివరీ(అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు), ఫుడ్ డెలివరీ(స్విగ్గీ, జొమాటో వంటివి), ఫార్మా ఇండస్ట్రీ సహా ప్యాకేజింగ్ అవసరమైన ప్రతి సంస్థలో వీరికి ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఎలక్ట్రికల్ - ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల నుంచి వినియోగదారుడి చెంతకు చేరాల్సిన ప్రతి ప్రొడక్ట్‌కు ప్యాకేజింగ్ అవసరమే. అందుకే ఈ డిప్లొమా చేసిన వారికి నిరుద్యోగం అన్న ప్రసక్తే ఉండదు. నిజానికి డిమాండ్‌కు తగ్గ సరఫరాలేదు. ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్ కోసం ఈ ఏడాది 16 మందిని తీసుకున్న రెడ్డి ల్యాబ్స్ ఒకొక్కరికి స్టయిపెండ్‌గా రూ.15,000 చెల్లిస్తోందని ప్యాకేజింగ్ టెక్నాలజీ హెడ్ డాక్టర్ వై.వెంకటరెడ్డి తెలిపారు. తదుపరి మరో ఆరు నెలలు కూడా అదే స్టయిపెండ్‌కు పనిచేస్తే రెగ్యులర్ స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అంతేకాకుండా అరబిందో సహా పలు కంపెనీలు కూడా తమ విద్యార్థులను ఈ ఏడాది తీసుకున్నాయని తెలిపారు. చివరకు కోర్సు పూర్తి చేయలేని విద్యార్థులను సైతం కంపెనీలు తీసుకునే పరిస్థితి నెలకొందని ఆయన వివరించారు.

SCHOLARSHIP ALERT

Kotak Life Insurance Scholarship Program

Description: An initiative by Kotak Life Insurance Company Ltd. to provide financial assistance to students from Tamil Nadu and Maharashtra to help them pursue their undergraduate studies in the commerce stream.

Eligibility:

- Open to students who are residents of Tamil Nadu and Maharashtra.
- Applicants must be enrolled in the first year of a B.Com. program at any of the eight specified colleges in Tamil Nadu and Maharashtra. The list of colleges is given below:
  - A. Veeriya Memorial Sri Pushpam College (Thanjavur, Tamil Nadu)
  - Nadar Mahajana Sangam S. Vellaichamy Nadar College (Madurai, Tamil Nadu)
  - Edayathangudy G.S. Pillay Arts and Science College (Nagapattinam, Tamil Nadu)
  - Jai Hind Sindhu Education Trust's Manghanmal Udharam College of Commerce (Pune, Maharashtra)
  - Gokhale Education Society's B.Y.K. (Sinnar) College of Commerce (Nashik, Maharashtra)
  - LRD and SRP College for Women (Nagpur, Maharashtra)
  - Vysya Arts and Science College (Salem, Tamil Nadu)
  - Dharmapuram Adhinam Arts Col lege (Mayiladuthurai, Tamil Nadu)
- Applicants must have scored 65% marks or more in Classes 10 and 12.
- Applicants must have passed Class 12 in the year 2023-24.
- The applicant's annual family inco me must be INR 3,60,000 or less.

Prizes & Rewards: Up to INR 30,000 per year

Last Date: 31-07-2024 ***Application mode:*** Online only

Short Url: www.b4s.in/aj/KLISP2

HOPE Engineering Scholarship by Schaeffler India

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000 ***Last Date:*** 30-07-2024

Application mode: Online only ***Short Url:*** www.b4s.in/aj/SIHE15

దిక్సూచి DIKSUCHI

Tata Capital Pankh Scholarship Program

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.

Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.

Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less) ***Last Date:*** 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TCPS27

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/FsGGu7Qలో చదవండి.

జేఎన్‌టీయూకేలో ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్(ఐసీపీ)లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్)తో కలసి ఆరేళ్ల ప్రోగ్రామ్‌ను, యూఎస్ఏలోని యూనివర్సిటీ ఆఫ్ నార్తరన్ అయోవా(యూఎన్ఐ)తో కలసి నాలుగేళ్ల ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.



జేఎన్‌టీయూకే-బీటీహెచ్ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్‌లో సీఎస్ఈ, సీఎస్ఈ(ఏఐ&ఎంఎల్), ఈసీఈ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు చొప్పున మొత్తం 60 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం సీట్లను ఐఐటీ జేఈఈ మెయిన్ అభ్యర్థులకు మిగిలిన సగం సీట్లను టీజీ/ఏపీ ఈఏపీసెట్ అభ్యర్థులకు నిర్దేశించారు.

- ప్రోగ్రామ్ మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్‌టీయూలో, చివరి మూడేళ్లు బీటీహెచ్-స్వీడన్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది కోర్సును బీటీహెచ్‌లో పూర్తిచేశాక ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి కాకినాడ జేఎన్‌టీయూ బీటెక్ డిగ్రీని, బీటీహెచ్ బీఎస్ డిగ్రీని ప్రదానం చేస్తాయి. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ మొత్తం పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది.

ఎంఎస్ స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్-సిస్టమ్స్.

జేఎన్‌టీయూకే-యూఎన్ఐ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్‌లో ఈఈఈ స్పెషలైజేషన్ ఉంది. మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్‌టీయూలో, చివరి ఏడాది యూఎన్ఐ-యూఎస్ఏలో చదవాలి. వీరికి జేఎన్‌టీయూకే నుంచి బీటెక్ డిగ్రీ, యూఎన్ఐ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు యూఎన్ఐలో కోర్సును కొనసాగిస్తూ మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో చేరే వీలుంది.

అర్హత వివరాలు: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులందరికీ జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత తప్పనిసరి.

- బీటీహెచ్ నిబంధనల ప్రకారం ఇంటర్ ఆంగ్ల మాధ్యమంలో చదవని వారు టోఫెల్/ఐఈఎల్‌టీఎస్ అర్హత పొందాల్సి ఉంటుంది. టోఫెల్‌లో 575/90 స్కోర్; ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5 స్కోర్‌తోపాటు మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్ రావాలి.
- యూఎన్ఐ నిబంధనల ప్రకారం ఐఈఎల్‌టీఎస్‌లో 6.0 లేదా టోఫెల్‌లో 79 స్కోర్ ఉండాలి. మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే బీఎస్ డిగ్రీలో కనీసం 3.0 క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ ఉండాలి. మూడు రికమండేషన్ లెటర్లు, పర్సనల్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూకే, కాకినాడ - 533003
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in



నవ్య | చిత్రజ్యోతి

అధర్మాన్ని అణిచేయగా...



భారీ అంచనాల మధ్య 'కల్కి 2898 ఏడీ' చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచానాలు ఉన్నాయి. ప్రమోషనల్ కంటెంట్‌తో చిత్ర బృందం ఎప్పటికప్పుడు ఆ అంచనాలను రెట్టింపు చేస్తోంది. తాజాగా 'థీమ్ ఆఫ్ కల్కి' లిరికల్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. 'అధర్మాన్ని అణిచేయగా' అంటూ చంద్రబోస్ రాసిన ఈ పాటను కాలభైరవ పాడారు. సంతోష్ నారాయణ్ స్వరాలు సమకూర్చారు. పాత్రల తాలుకు నేపథ్యం, వాటి సంఘర్షణ.. ఇవన్నీ పాటలో చూపించారు. ఇటీవల ఈ పాటను మధురలో ఆవిష్కరించారు. ప్రముఖ నటి, నర్తకి శోభనా చంద్రకుమార్ ఈ పాట కోసం గజ్జె కట్టారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపిక, దిశా పటాని కీలక పాత్రలు పోషించారు.

ఎలా ఉన్నావ్ శ్రీలీల

● బుగ్గ గిల్లి.. ఆప్యాయంగా పలకరించిన సంగీత దర్శకుడు తమన్



శ్రీవారి దర్శనార్థం వచ్చిన హీరోయిన్ శ్రీలీలను చూసిన సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ ఆప్యాయంగా పలకరించారు. శ్రీలీల మంగళవారం స్వామిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వస్తున్న క్రమంలో దర్శనానికి వెళుతున్న తమన్ మహద్వారం వద్ద ఎదురుపడ్డారు. దీంతో తమన్ ఆగి శ్రీలీలను బుగ్గ గిల్లి.. ఎలా ఉన్నావ్ అంటూ పలకరించారు. అనంతరం శ్రీలీల తన కుటుంబ సభ్యులను తమన్‌కు పరిచయం చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

నేతాజీ మార్గంలో నేను



'ఇది రెండో స్వతంత్ర పోరాటం... గాంధీజీ మార్గంలో మీరు, నేతాజీ మార్గంలో నేను' అంటున్నారు కమల్‌హాసన్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2') చిత్రంలోనిదీ డైలాగ్. మంగళవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. దేశంలో అవినీతిపరులను ఏరి పారేసేందుకు ఈ సారి సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ ఎలాంటి సాహసాలు చేయబోతున్నాడో అనే ఆసక్తిని కలిగించేలా ట్రైలర్‌ను రూపొందించారు. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, సిద్ధార్థ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి శంకర్ దర్శకుడు. 1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి ఇది కొనసాగింపు. జూలై 12న 'భారతీయుడు 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. లైకా ప్రొడక్షన్స్ రెడ్ జెయింట్ బ్యానర్స్‌పై సుభాస్కరన్ నిర్మించారు.



పవన్‌తో అల్లు అరవింద్ భేటీ

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ఏపీలో సినీ నిర్మాణ రంగం, ప్రదర్శన రంగం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గురించి ఈ సమావేశంలో వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది.

శ్రీనివాసుని సన్నిధిలో సుశీల



సీనియర్ నేపథ్య గాయని పి. సుశీల మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమె శ్రీవారికి తలనీలాలు సమర్పించి మంగళవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు సుశీలను చూసిన పలువురు అభిమానులు దగ్గరకు వెళ్లి పలకరించారు. కొందరు ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు. ఎన్నాళ్ల నుంచో స్వామి వారికి తలనీలాలు సమర్పించే మొక్కు ఉందనీ, ఇన్నాళ్లకు అది తీరిందని సుశీల చెప్పారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/adGg9cX లో చదవండి.

రెగ్యులర్ అధికారిని నియమించండి

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారిని నియమించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్లా సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం గిరిజన వసతి గృహంలో ఆయన మాట్లాడుతూ, గతంలో అధికారిగా పనిచేసిన ఉద్యోగి పదవీ విరమణ చేశారని, రెండు నెలలు కావస్తున్నా, ఇంత వరకూ రెగ్యులర్ అధికారిని నియమించలేదన్నారు. తక్షణమే కలెక్టర్ స్పందించి రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరారు.

ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలి

విజయనగరం రింగురోడ్డు: బ్రాహ్మణ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలని కోరుతూ రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన సీనియర్ ఉపాధ్యక్షుడు భోగాపురపు వాయునందన శర్మ మంగళవారం మంగళగిరిలో లోకేష్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. వేమూరి ఆనందసూర్యకు బ్రాహ్మణ సామాజిక వర్గం తరఫున ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

ప్రజలకు అసౌకర్యం కలిగించొద్దు

విజయనగరం రింగురోడ్డు: ప్రజలకు అసౌకర్యం కలిగించే ఏ చర్యలైనా ఉపేక్షించవద్దని ప్రణాళికా కార్యదర్శులకు నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు సూచించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రణాళిక అధికారులు, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయాల వారీగా ప్రణాళిక విభాగానికి సంబంధించి చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రకటన బోర్డుల పన్నులు, ఇతరత్రా పన్నులు రాబట్టడంలో ఉదాసీనంగా వ్యవహరించిన కార్యదర్శుల పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. నగరంలో భవన వ్యర్థాలు ఎక్కడ పడితే, అక్కడ నిల్వ లేకుండా చూడాలన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించాలన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మధుసూదనరావు, అమ్మాజీరావు, సర్వేయర్ సింహాచలం, పీపీఎస్ ఫిలిప్, ప్రణాళిక కార్యదర్శులు పాల్గొన్నారు.

● నగరంలో తాగునీటిని సక్రమంగా పంపిణీ చేయడానికి ఇంజినీరింగు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కమిషనర్ నాయుడు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జొన్నగుడ్డిలో నీటి పంపిణీ విధానాన్ని పరిశీలించారు. అక్కడ రెండిళ్లకు మంచినీటి సరఫరా కాకపోవడంపై ఆరా తీశారు. వారికి కూడా అవసరమైన పైపులైన్లు మార్చి, సక్రమ నీటి పంపిణీ విధానానికి చొరవ చూపాలన్నారు. డీఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కోండ్రు రాక

రాజాం: టీడీపీ శాసన సభ్యునిగా ఎన్నికైన కోండ్రు మురళీమోహన్ మొదటిసారిగా బుధవారం రాజాం వస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు చీపురుపల్లి రోడ్డులో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తారు. 4 గంటలకు పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. 4.30 గంటలకు ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న నవదుర్గ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తారు. అనంతరం శ్యాంపురం క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారని తెలిపాయి.

రేగిడి: రాజాం ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారి బుధవారం జిల్లాకు విచ్చేస్తున్న మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్‌కు భారీ ఎత్తున స్వాగతం పలకడానికి రేగిడి మండల టీడీపీ క్యాడర్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భారీ సంఖ్యలో వాహనాలతో స్వాగతం పలకాలని నిర్ణయించింది.

నేడు కంచరాంలో విచారణ

రాజాం: కంచరాం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధుల్లో అవకతవకలు జరిగినట్టు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఎంపీడీవో వి.శ్రీనివాసరావు స్పందించారు. విచారణ నిమిత్తం ప్రత్యేక బృందాన్ని నియమించినట్టు తెలిపారు. ఏపీడీ ఎల్.శ్రీనివాసరావు, ఏపీఓ సాయిరాం, టెక్నికల్ అసిస్టెంట్ ఎంచాయితీ కార్యదర్శిని నియమించినట్టు తెలిపారు. బుధవారం వారు విచారణ చేపడతారని తెలిపారు. వారి నివేదికను జిల్లా అధికారులకు పంపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి నుంచి నిధులు రాబట్టడానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో చెప్పారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

లక్కవరపుకోట: జమ్మాదేవిపేట వద్దగల పాల్ మెమోరియల్ చర్చి వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్టు అధినేత డి.డానియేల్ తెలిపారు. శంకర్ ఫౌండేషన్ వారి సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పరిధి దాటి వైద్యం చేయొద్దు

విజయనగరం రింగురోడ్డు: వైద్య వృత్తికి వన్నెతెచ్చేలా ఆర్ఎంపీ వైద్యులు వ్యవహరించాలని వైద్య నిపుణులు డాక్టరు చిట్టి రామారావు అన్నారు. మంగళవారం విజయనగరం సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ ఆత్మీయ సంఘ కలయిక, వైద్య అవగాహన సదస్సుని ముడిదాంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ చిట్టి రామారావు మాట్లాడుతూ, ఆర్ఎంపీ వైద్యులు పరిధి దాటి వైద్యం చేయొద్దని సూచించారు. గ్రామీణ వైద్యుల సంఘ గౌరవ అధ్యక్షుడు గోపి మాట్లాడుతూ హరిజన, గిరిజన గ్రామాలతో పాటు మురికివాడల్లో నివసించే ప్రజల ప్రాణాలను ప్రాథమికంగా కాపాడేది ఆర్ఎంపీ వైద్యులేనన్నారు. ఆర్ఎంపీలు సేవాభా వంతో పని చేసి వైద్య వృత్తికి మరింత గౌరవాన్ని తీసుకురావాలని సూచించారు. ప్రతినిధులు కనకాచారి, సోమేశ్వరి, ఆర్ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.25 వేలు వితరణ

రామభద్రపురం: కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని వీఎస్ సుధారాణి అదే పాఠశాలకు తన వేతనం నుంచి రూ.25 వేలు వితరణగా అందజేశారు. పాఠశాలకు అవసరమైన పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ (మైకొసెట్) కొనుగోలుకు రూ.25వేలు అందజేసినట్టు హెచ్ఎం రావాడ భాస్కరరావు తెలిపారు. సుధారాణిని పాఠశాల సిబ్బంది, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మండల రమేష్‌నాయుడు అభినందనలు తెలిపారు.

వ్యవసాయానికి ఉపాధిని వర్తింపజేయాలి

రేగిడి: రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం, కూలీల కొరత దృష్ట్యా కొత్త ప్రభుత్వం వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని వర్తింపజేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు కోరారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్తామని వెల్లడించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం రైతుల ను విస్మ రించి, మూల్యం చెల్లించుకుందని.. ఇది గ్రహించి కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం రైతులకు మేలు చేసే విధానాలు అవలంబించాలని సూచించారు.

దివ్యాంగురాలికి ఆర్థిక సాయం

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలింగ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనీగా విధులు నిర్వహించిన నేపథ్యంలో వచ్చిన పారితోషికాన్ని ప్రభుత్వ ఉపాధ్యాయుడు జేసీ రాజు ఓ దివ్యాంగురాలికి వితరణగా అందజేశాడు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఆయన విధులు నిర్వహించడంతో ప్రభుత్వం ఇచ్చి న పదివేల రూపాయల నగదును స్థానిక తారకరామాకాలనీకి చెందిన నిండు గుండ భువనేశ్వరి అనే దివ్యాంగ విద్యార్థినికి అందజేశారు. న్యూజివీడులో ట్రిపుల్ ఐటిలో భువనేశ్వరి చదువుతోంది.

చేయూత నిధులు చెల్లించండి

● బొబ్బిలిలో మహిళల ధర్నా

బొబ్బిలి, జూన్ 25: చేయూత పథకంలో నాలుగో విడత డబ్బులు చెల్లింపు విషయంలో ఎన్నికల సమయంలో వైసీపీ ప్రభుత్వం నానా హడావిడి చేసిందని, ఆ డబ్బులు ఇప్పటికీ కొంతమంది మహిళల ఖాతాల్లోకి జమకాలేదని ఆరోపిస్తూ మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు మహిళా సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమపథకాలన్నిటినీ యథాతథంగా అమలు చేయాలని జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు పి.శంకరరావు ఆధ్వర్యంలో మహిళలు నినాదాలు చేశారు. బొబ్బిలి మండలం రంగరాయపురం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద వందరోజుల పనికల్పించడం లేదంటూ వేతనదారులంతా నినాదాలు చేశారు. తమకు వందరోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ బుధవారం ఈ రెండు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమస్యను పరిష్కరించకపోతే ఎల్లుండి నుంచి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని శంకరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.



మండలపరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

కేబినెట్ నిర్ణయాలతో ఎంతో మేలు

● ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన కేబినేట్ మంత్రు లకు ఆంధ్ర ప్రజలమంతా రుణపడి ఉంటామని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. మంగళవారం ఆమె నివాసం వద్ద టీడీపీ-జనసేన నేతలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు సంతకాలు చేసిన 5 పథకాలను అమలు చేసేందుకు కేబినేట్ నిర్ణయం తీసుకోవడం సాహసోపేతమని కొనియాడారు. అందరూ బాధ్యతతో వ్యవహరించి ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని నేతలకు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, దుర్గా ఉమేష్, రత్నాజీ, కె.విజయ్‌కుమార్, లెంక శ్రీను, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

జేఎస్ఎల్ కార్మికుల నిరసన

● కొనసాగుతున్న రిలే దీక్షలు, వంటావార్పు



రిలే దీక్షలు చేస్తున్న కార్మికులు

కొత్తవలస, జూన్ 25 : మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ, జిందాల్ నగర్‌లో నున్న జేఎస్ఎల్ కార్మికుల సమస్య పరిష్కారం కావడంలేదు. దీంతో కార్మికులు కూడా తమ నిరసనలు ఆగడం లేదు. రిలే దీక్షలు, వంటా వార్పును కొనసాగిస్తున్నారు. ఇవన్నీ కర్మాగారం ఎదుట నున్న మెయిన్ గేట్ వద్దనే కొనసాగడంతో సమస్య పరిష్కరించకుండానే నిరసన శిబిరాలను తొలగించడానికి యాజమాన్యం ప్రయత్నాలు సాగిస్తోంది. యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే సమస్యను పరిష్కరించడం లేదని కార్మికులు ఆరోపణలు చేస్తున్నారు. కర్మాగారంలో పని చేసే 40 సంవత్సరాల సర్వీసు ఉన్న కార్మికులే అత్యధికంగా నెల వేతనం 11,500 రూపాయలు ఉందని కర్మాగారం లాకౌట్ చేసినందున వేతనంలో సగం లే ఆఫ్ కింద ఇవ్వాలని కోరామని కార్మిక సంఘం నాయకులు పిల్లా అప్పలరాజు, నమ్మి చిన బాబు తెలిపారు. కర్మాగారం గుర్తించిన 59 మంది కార్మికులకే లే ఆఫ్ ఇస్తామని మిగిలిన కార్మికులకు తాము ఇవ్వలేమని యాజమాన్యం చెబుతోందన్నారు. లే ఆఫ్ ఇవ్వక పోతే లాకౌట్ ఎత్తి వేసి కనీసం నెలకు 21 రోజులు పనైనా కల్పించాలని కోరామన్నారు. అందుకు యాజమాన్యం అంగీకరించడం లేదని చెబుతోందన్నారు. నెలకు 15 రోజులు సగం మందికి మిగిలిన నెల రోజులు మరో సగం మందికి చెబుతామని ఆ పనిని కూడా రెండు నెలలు తరువాత చెబుతామని యాజమాన్య మెలిక పెట్టిందని ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు తమసమస్యను తెలుసుకున్నందున పరిష్కారం చేస్తారని ఆశగా చూస్తున్నామని తెలిపారు.

మడ్డువలస ఎడమ కాలువకు గండి

వంగర, జూన్ 25: మడ్డువలస రిజర్వాయర్ ఎడమ కాలువకు గండిపడింది. నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఎడమ కాలువ ప్రధాన గేట్లు మరమ్మతులకు గురికావడంతో నిత్యం నీరు వృథాగాపోతోంది. రెండు రోజుల క్రితం భారీ వర్షానికి గ్రామంలోని నీరు ఎడవ కాలువలో పడటంతో మగ్గూరు సమీపంలో మంగళవారం గండి పడింది. దీంతో నీరు పంట భూముల్లో చేరడంతో వరి ఎద మడులు కుళ్లిపోయాయి. రైతులు ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



మగ్గూరు వద్ద మడ్డువలస కాలువకు గండి పడడంతో ఇస్తుక బస్తాలతో పూడ్చిన రైతులు

బోర్డుపై పేరు మారింది..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బోర్డుపై పేరు మార్చిన దృశ్యం

జామి: మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఆవరణలో ఉన్న సమాచారహక్కు బోర్డులో అధికారుల పే ర్లు తప్పుగా ఉన్నాయ ని మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు స్పందించారు. 'ఈ బోర్డులు మార్చరా' అంటూ వార్త ప్రచురితం కావడంతో జయశ్రీ స్పందించారు. వెంటనే పాత జిల్లా విద్యాశాఖాధికారి పేరుపై తెల్లకాగి తం అంటించి దానిపై ప్రస్తుత విద్యాశాఖాధికారి పేరు రాయించారు.

ఆకట్టుకున్న మాక్‌పోలింగ్

శృంగవరపుకోట రూరల్: ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించి విద్యార్థి నాయకుడిని ఎన్నుకున్న తీరు ఆకట్టుకుంది. మంగళవారం ఇంచార్జి హెచ్ఎం శివరామకృష్ణ ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎస్‌పీఎల్ పదవి కోసం 8 మంది పోటీ పడ్డారు. ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. ఎన్నికల అధికారులుగా ఉపాధ్యాయులు సతీష్, శోభారాణి, జయలక్ష్మి, శివాజీ, శ్రావణి, లావణ్య, సకీనా, ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఏవీ స్వామి, హరి, సత్యనారాయణ, పాపారావు, సూర్యకుమారి వ్యవహరించారు.



ఓట్లు వేస్తున్న విద్యార్థులు

జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలి

● పవన్‌కల్యాణ్‌ను కోరిన జనసేన నాయకుడు

రాజాం రూరల్, జూన్ 25: విజయనగరం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు పెద్దపీట వేయాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కోరినట్లు ఆపార్టీ ప్రచారకమిటీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పొగిరి సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఉదయం పవన్‌ను కలిసి ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందించానని, ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన అంశాలను వివరించానని ఆయన వెల్లడించారు. జిల్లా నుంచి వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశానని తెలిపారు. పవన్ కల్యాణ సుముఖత వ్యక్తం చేసినట్లు సురేష్ బాబు తెలిపారు.. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పనిచేయాలని పవన్‌కల్యాణ్ తనకు సూచించారని సురేష్ బాబు తెలిపారు.



పవన్‌కల్యాణ్‌ను అభినందిస్తున్న సురేష్ బాబు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

రేగిడి, జూన్ 25: డెంగ్యూ, డయేరియా తదితర సీజనల్ వ్యాధులపై హెల్త్, సచివాలయ సిబ్బంది అప్ర మత్తంగా ఉండాలని ఎంపీడీఓ శ్యామలా కుమారి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీ రింగ్ అసిస్టెంట్లు, హెల్త్ సిబ్బందితో ఎంపీడీఓ వేర్వేరుగా సమీక్షలు నిర్వహించారు ఎక్కడా శానిటేషన్ సమస్యలు రా కూడదని, తాగునీటి ని సక్రమంగా అందించాలని సూచించారు. ఈ సమీక్షలో ఈవోఆర్డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు

విజయనగరం దాసన్నపేట, జూన్ 25: జిల్లా కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన డాక్టరు బీ ఆర్ అంబేడ్కర్‌ను మంగళవారం ఆయన ఛాంబర్లో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ హిమబిందు, సభ్యులు భవానీ, సుధారాణి, మిషత్ వాత్సల్య , నాగరాజు, వెంకటరావు, సంధ్య, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న కేసలి అప్పారావు

ప్రభుత్వ బడిని రక్షించుకుందాం

చీపురుపల్లి: ప్రభుత్వ బడిని రక్షించుకుందాం అనే నినాదంతో స్థానిక ఎమ్మార్సీ వద్ద యూటీఎఫ్ నాయకులు మంగళవారం కర పత్రాలను ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల కోసం ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు మీసాల అప్పలనాయుడు, గొర్లె పద్మావతి, మామిడి శ్రీనివాసరావు, పడిపేన బలరాం, చింత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● **బొబ్బిలి:** 'ప్రభుత్వ బడిని రక్షించుకుందాం.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం' అని యూటీఎఫ్ పిలుపునిచ్చింది. స్థానిక ఎంఆర్సీ భవనంలో మంగళవారం సాయంత్రం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి మాట్లాడుతూ బడి అంటే మనందరిదీ అనే భావన ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు ప్రసన్న కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు, నాయకులు బత్తుల శ్రీనివాస్, రాధాకృష్ణ, మహేశ్, అప్పలనాయుడు, సత్యనారాయణ, రాంబాబు, అనంత్, కృష్ణదాసు పాల్గొన్నారు.

రామస్వామిపేటలో విద్యుత్ కోతలు

వేపాడ: రామస్వామిపేట గ్రామాన్ని విద్యుత్ కోతలు వేధిస్తున్నాయి. వేళాపాళాలేని విద్యుత్ కోతలతో తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరాకాలం వచ్చినా గ్రామాన్ని విద్యుత్ వెతలు చుట్టు ముట్టడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే విద్యుత్ మీటర్లను రద్దు చేసుకుంటామని మూకుమ్మడిగా హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి విద్యుత్ కోతలను ఆపాలని కోరారు.



విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న రామస్వామి పేట గ్రామం ఇదే

మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు అభినందన

విజయనగరం రూరల్, జూన్ 25: జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జాప్) విజయనగరం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను అభినందించారు. స్థానిక జడ్పీ అతిథి గృహంలో జాప్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, సమస్యలపై రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవనాపు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు మానాపురం రవి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. అర్హులైన జర్నలిస్టులు అందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, గృహ నిర్మాణ పథకం వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాప్ ప్రతినిధులు గోపాలవర్మ, గౌరీశంకరరావు, రమణ, హేమంత్‌కుమార్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన క్రెడాయ్ ప్రతినిధులు

విజయనగరం క్రెడాయ్ చాప్టర్ ప్రతినిధులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నిర్మాణ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుని పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ ప్రతినిధులు కాటూరి సుభాష్ చంద్రబోస్, పార్థసారథి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గరుగుబిల్లి, జూన్ 25: వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు, గరుగుబిల్లి ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దళాయివలస గ్రామానికి చెందిన ఏగిరెడ్డి వెంకటరమణ(47) కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పొలానికి వెళ్లి గడ్డి మందు కొట్టిన తర్వాత ఇంటికి వచ్చాడు. ఇంటిలో మద్యం సేవించి రాత్రి నిద్రపోయాడు. అనంతరం మంగళవారం తెల్లవారుజామున మృతి చెంది ఉండడంతో భార్య భవాని వెంటనే స్థానికులకు సమాచారం అందించింది. మృతదేహంపై చిన్న చిన్న గాయాలు, రక్తపుమరకలు ఉండడంతో వారు పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న చినమేరంగి సీఐ మంగరాజు మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అమ్మన్నరావు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా వెంకటరమణకు, భార్య భవానికి గత కొద్ది నెలలుగా ఘర్షణలు జరుగుతున్నట్లు సమాచారం. మృతుడికి కుమార్తె ధనుశ్రీ ఉన్నారు.



వెంకటరమణ (ఫైల్)

చికిత్స పొందుతూ ఒకరు..

భోగాపురం, జూన్ 25: ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్ఐ టీఎస్ఎన్ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన కర్రోతు నారాయణ(44) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నారాయణ తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో నిత్యం మద్యం సేవించేవాడు. దీని కారణంగా ఆరోగ్యం పాడవుతుందని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెంది ఈనెల 12న గ్రామ సమీపంలోని కళ్లం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకి పాల్పడ్డాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108లో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడు భార్య కర్రోతు ఎల్లయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

● మరో ఇద్దరి కోసం గాలింపు

విజయనగరం క్రైమ్, జూన్ 25: కిడ్నాపింగ్ కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ వెంకట్రావు తెలిపారు. వన్‌టౌన్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. రాజస్థాన్‌లోని ఓ గ్రామానికి చెందిన భగవాన్‌రామ్ స్థానికంగా వ్యాపారం చేసుకుంటూ నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి తక్కిడివీధిలో కుటుంబంతో పాటు జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 14న రాజస్థాన్‌లోని అదే గ్రామానికి చెందిన విజలారామ్‌తో పాటు కొంత మంది విజయనగరం వచ్చి భగవాన్‌రామ్‌ను కారులో ఎక్కించుకుని మద్యం సేవించారు. అనంతరం భగవాన్‌రామ్‌ను తీవ్రంగా కొట్టారు. తరువాత కారులో బెంగుళూరు తీసుకువెళ్లేందుకు బయలుదేరారు. ఇలా వెళ్తుండగా మార్గమధ్యలో భగవాన్‌రామ్‌తో బలవంతంగా మూత్రం తాగించి వీడియో రికార్డ్ చేశారు. భగవాన్‌రామ్ స్నేహితునికి బలవంతంగా ఫోన్ చేయించి ఆ స్నేహితుడినుంచి రూ.35ఫోన్ పే ద్వారా తీసుకున్నారు. ఈవిషయం ఎవరికైనా చెపితే చంపేస్తామని బెదిరించారు. తరువాత భగవాన్‌రామ్‌ను అక్కడే విడిచి పెట్టి పరారయ్యారు. నిందితులు తీసిన వీడియోలను రాజస్థాన్‌లో సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ విషయం భగవాన్ రామ్‌కు తెలిసి ఈనెల 22న వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితుల్లోని దేవాసి విజలారామ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులోని మిగిలిన నిందితులు ఈజల్‌రామ్, దిలీప్‌లు పరారీలో ఉన్నారని, వీరిని త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.



అరెస్టు చేసిన నిందితునితో పోలీసులు

పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడిని కలిసిన కలిశెట్టి

విజయనగరం, జూన్ 25(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షునిగా నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు ఎన్నికయ్యారు. బుధవారం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిన తరువాత విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షునిగా పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీలకు నాయకత్వం వహిస్తారు.



టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైన శ్రీకృష్ణ దేవరాయలను కలిసిన ఎంపీ

కలెక్టర్‌ను సత్కరించిన మంత్రి కొండపల్లి

కలెక్టరేట్: బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టరు నాగలక్ష్మిని మంగళవారం రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దుశ్శాలువతో సత్కరించారు. ఆమెకు పూలగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. జిల్లాకు సమర్థవంతమైన సేవలు అందించారని కొనియాడారు.



కలెక్టర్‌ను సత్కరిస్తున్న మంత్రి

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విజయనగరం క్రైం: విద్యార్థులు, యువత భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ డాక్టర్ బి.వెంకటరావు అన్నారు. మంగళవారం నగరంలోని ఓ కళాశాలలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ హరిబాబు నాయుడు, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

రాజాం: సారధి రోడ్డులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలను కూడా తీసుకుంటామని కళాశాల ప్రిన్సిపాల్ కుమరాపు జనార్ధనరావు అన్నారు. హెచ్ఎం మాధురి, పెంకి చైతన్యకుమార్ ఉన్నారు.

అమ్మో.. రహదారి



తారాపురం జాతీయ రహదారిపై ఏర్పడిన పెద్ద గొయ్యి

రామభద్రపురం: మండల పరిధిలోని తారాపురం జాతీయ రహదారిపై రోడ్డు పూర్తిగా గోతులు, గుంతలమయం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దారి పొడవునా రహదారి మరమ్మతులకు గురై సంవత్సరాలు కావస్తున్నా పట్టించుకునే వాడే కరువయ్యాడని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా స్పీడ్ బ్రేకర్ల వద్ద పెద్దగొయ్యి ఏర్పడడంతో రాత్రివేళల్లో ప్రయాణాలు చేస్తున్న వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి గుండా నిత్యం వేలాది వాహనాలు వెళ్తున్నా దీనిని పట్టించుకునేవారే కరువయ్యారు. ఆంధ్ర, ఒడిషా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకుచెందిన వాహనాలు కూడా ఈ రోడ్డు గుండానే ప్రయాణం చేస్తున్నాయి. అంతేకాకుండా స్పీడ్ బ్రేకర్ల వద్ద ద్విచక్రవాహన ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి జాతీయ రహదారి మరమ్మతులు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల ఈ జాతీయరహదారి విస్తరణ పనులు గజపతినగరం నుంచి సాలూరు వరకు జరిగినప్పటికీ ఇక్కడ మాత్రం ఎందుకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

స్పందించారు.. వ్యర్థాలు తొలగించారు



పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న ఎంపీడీవో దేవకుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మక్కువ: స్థానిక ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి పక్కన వ్యర్థాలు పేరుకుపోవడంపై ఇటీవలే ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'నిల్వ నీటిలో చెత్త పోగులు' అనే కథనంపై అధికారులు స్పందించారు. ఎంపీడీవో పి.దేవకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రొక్లయినర్‌తో వ్యర్థాలను తొలగింపజేశారు. నిల్వ నీటిని భైరిసాగరంలోకి వెళ్లేలా కాలువ నిర్వహణ పనులు చేపట్టారు. పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగింపజేసి, ట్రాక్టర్లతో డంపింగ్‌యార్డుకు తరలించారు. అనంతరం బ్లీచింగ్ జల్లి దుర్గంధ భరిత వాతావరణం లేకుండా చేశారు. రోడ్డు పక్కన వ్యర్థాలను ఇకపై వేస్తే చర్యలు తప్పవని, ఇంటి వద్ద చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని ఉదయం సమయంలో పారిశుధ్య ట్రాక్టర్ వేస్తే అందులో చెత్తను వేసుకోవాలని బీసీకాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎల్.అప్పలశివరామం, కార్యదర్శి సురేష్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో పుస్తకాల విక్రయం ఆపాలి

పార్వతీపురంటౌన్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పాఠ్యపుస్తకాల అమ్మకాలను ఆపాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రాజు, పండులు మాట్లాడుతూ ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాల అమ్మకాను పరిశీలించామని, అధిక ధరలకు అమ్ముతున్నట్లుగా గుర్తించామని తెలిపారు. అందుకే నిరసనలు చేపట్టి విద్యాశాఖాధికారులకు తెలియజేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా అధిక ధరలకు పుస్తకాలను అమ్ముతున్న ప్రైవేటు పాఠశాలలను సీజ్ చేయాలన్నారు. ఈ విషయమై మండల విద్యాశాఖాధికారులు ఎస్.సింహాచలం-1, ప్రసాద్-2 మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో అధిక ధరలకు అమ్మకాలపై సంబంధిత యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. సదరు పాఠశాలలో పుస్తకాలు అమ్ముతున్న గదిని సీజ్ చేశామని వెల్లడించారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం



బీజేపీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

పార్వతీపురం టౌన్: భారతదేశ చరిత్రలో జూన్ 25వ తేదీ చీకటి రోజు అని బీజేపీ మన్యం జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక బైపాస్ రహదారిలో ఆ పార్టీ కార్యాలయంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినంగా బ్లాక్ డే కార్యక్రమాన్ని పాటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాంగ్రెస్ నియంత పాలనకు నిదర్శనమన్నారు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ తీసుకున్న నిర్ణయాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కాంగ్రెస్ దురాగతాలు, నిరంకుశ వైఖరిని నిరసిస్తుండడం వల్లే బీజేపీకి దేశంలో పట్టం కడుతున్నారని అన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను అమలుకు మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం చేయడం సంతోషదాయకమన్నారు.

రహదారిపై నిలిచిన నీటిలో వినూత్న నిరసన

కొమరాడ: అంతర్ రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతుల్లో చేరిన వర్షపు నీటిలో సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి మంగళవారం వినూత్నంగా నిరసన చేపట్టారు. గోతుల్లో నిలిచిన బురదనీటిలో ఈత కొడుతూ నిరసన తెలియజేశారు. తక్షణమే గోతులను పూడ్చి పెట్టాలని డిమాండ్ చేశారు.



గోతుల్లో చేరిన వర్షపు నీటిలో ఈత కొడుతున్న సాంబమూర్తి

నీటి పరిరక్షణ అందరి బాధ్యత

సీతంపేట: మండలంలో నీటి పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీవో గీతాంజలి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమావేశ మందిరంలో ఉపాధి హామీ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భూగర్భ జలాలను సంరక్షించుకొనేందుకు భూమిలో నీరు ఉండే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో విద్యాసాగర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పాపారావు, వెలుగు సీసీ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి వీఆర్వోలు ప్రత్యేక చొరవ చూపాలని తహసీల్దార్ కె.జయ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని కోరారు. గతంలో పలు సమస్యలపై వినతులు అందించారని, గ్రామ స్థాయిలో నిశితంగా పరిశీలించి తగు న్యాయం చేయాలన్నారు. నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఎప్పటికప్పుడు అందించేలా దృష్టి సారించాలన్నారు. మ్యూటేషన్లతో పాటు భూసమస్యలపై వచ్చే వాటిని పరిశీలించి సిఫార్సు చేయాలన్నారు. తగాదాలకు ఆస్కారం లేకుండా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో వీఆర్వోలతో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎంకృష్ణ, సీనియర్ సహాయకుడు రమేష్ ఉన్నారు.

శుద్ధ జలాన్ని సరఫరా చేయడమే లక్ష్యం

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్ర ప్రజలకు శుద్ధ జలాన్ని సరఫరా చేయడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని తాగునీటి రిజర్వాయర్లను ఆయన మంగళవారం పరిశీలించారు. క్లోరినేషన్, పైప్ లైన్‌ల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టామన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా 30 వార్డుల్లో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టామన్నారు.

పిడుగులతో భారీ నష్టం

- ప్రభుత్వ కార్యాలయాల్లో మరమ్మతులకు గురైన కంప్యూటర్లు, ఫ్యాన్లు
- విద్యుత్ స్తంభాలపై చెట్లు.. నిలిచిన సరఫరా

గరుగుబిల్లి: మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షం, పిడుగులతో భారీ నష్టాలు నెలకొన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పిడుగులు పడటంతో మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయం, ఉపాధి హామీ పథకం కార్యాలయంలోని కంప్యూటర్లు, ఫ్యాన్లుతో పాటు పలు సామగ్రి మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు కంప్యూటర్లు మరమ్మతులకు గురి కావడంతో వెనుదిరిగారు. సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే గొట్టివలసలో పిడుగులు పడటంతో ఫ్యాన్లు, ఏసీ యంత్రాలు, ఇన్వెర్టర్లతో పాటు ఇతర సామగ్రి ధ్వంసమయ్యింది. మండలానికి సంబంధించి అధికంగా నష్టం వాటిల్లింది. వర్షాలు కారణంగా అర్ధరాత్రి సమయంలో రహదారిపై విద్యుత్ స్తంభాలపై చెట్లు పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీగా వర్షం కురవడంతో వరి నారుమళ్లు నీటిమయమయ్యాయి. ఎన్నడూ లేని విధంగా అధికంగా పిడుగులు పడటంతో గొట్టివలస, గరుగుబిల్లి, మరుపెంటతో పాటు పలు గ్రామాల్లో భారీగా నష్టం వాటిల్లింది. ప్రాణాపాయం లేకపోయినా గృహాల పరిధిలోని విద్యుత్ సామగ్రి అధికంగా పనికిరాని విధంగా తయారయ్యింది. ఉరుములతో కూడిన వర్షంతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేయడంతో గ్రామాల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రహదారి, విద్యుత్ స్తంభాలపై పడిన చెట్లును మండల విద్యుత్‌శాఖ ఏఈ బి.శంకరరావుతో పాటు సిబ్బంది సహకారంతో తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ● **సీతంపేట:** మండల కేంద్రం సీతంపేటలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. ఈ వర్షం తమకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో ధ్వంసమైన కంప్యూటర్లు



గరుగుబిల్లిలో రహదారిపై చెట్టు పడిన దృశ్యం

ఉద్యోగ భద్రత కల్పించాలి

- మంత్రి సంధ్యారాణికి వినతి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలోని సచివాలయంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు. తమ స్థానంలో రెగ్యులర్ సిబ్బంది వస్తున్నారని, దీనివల్ల తమకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని మంత్రికి సంఘ ప్రతినిధులు దేవపల్లి తేజేశ్వరి, బంగారమ్మ, లావణ్య, ప్రియా, రమ్య, కృపారాణి, మహేశ్వరి, సురేష్, సూర్య తదితరులు వివరించారు. దీనిపై ఆమె స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామన్నారు.



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

117 జీవోను రద్దు చేయాలి

జియ్యమ్మవలస: ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉన్న జీవో నెంబరు 117ను రద్దు చేయడంతో పాటు అదనపు బాధ్యతలు తగ్గించాలని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు గుంట్రెడ్డి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళవారం ఆయన అధ్యక్షతన పెదబుడ్డిడి ఎంపీపీ స్కూల్‌లో ఏపీటీఎఫ్ మండల శాఖ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏపీటీఎఫ్ మన్యం జిల్లా అధ్యక్షులు ఎం.మహేష్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అతిథులుగా వచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల మాజీ అధ్యక్షులు వై.శంకరరావు, కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నను కలిసిన పురుషోత్తం

గరుగుబిల్లి: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశు సంవర్ధక పాడి పరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును టీడీపీ రాష్ట్ర నాయకుడు మర్రాపు పురుషోత్తంనాయుడు అమరావతిలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి, సన్మానించారు. మండలానికి సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాలువల ఆధునికీకరణ చేపట్టాలి

- పవన్‌ను కోరిన సత్తిబాబు

పాలకొండ: తోటపల్లి ఎడమ కాలువ ఆధునికీకరణ పనులను చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఆ పార్టీ నాయకుడు గర్భాన సత్తిబాబు కోరారు. అమరావతిలో ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. తోటపల్లి ఎడమ కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై పవన్ సానుకూలంగా స్పందించారు. రైతులకు అండగా నిలుద్దామని హామీ ఇచ్చారు.



పవన్‌ను కలిసిన సత్తిబాబు

సీహెచ్‌సీని పరిశీలించిన ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న సమస్యలు, మందుల కొరత, మౌలిక వసతులు కల్పన తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గిరిజనులకు ఎంతగానో ఉపయోగపడుతున్న ఈ ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పోలూరు శ్రీనివాసరావు, వెంపటాపు భారతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న జగదీశ్వరి

జక్కువాని బంద పరిశీలన

సీతానగరం: కృష్ణరాయపురం గ్రామంలోని జక్కువాని బందను మంగళవారం జాయింట్ కలెక్టర్ ఎస్.శోభిక పరిశీలించారు. గ్రామస్థుడు గుణుపూరు పాదినాయుడు స్పందనలో జక్కువానిబంద ఆక్రమాలకు గురైనట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జేసీ ఆ బందను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చిన ఎన్‌డీఏ కూటమి



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్‌భాస్కర్

వీరఘట్టం: ఎన్నికల హామీలను ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని ఆ పార్టీల నేతలు అన్నారు. జామివారితోటలో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా మెగా డీఎస్సీ, వృద్ధాప్య పింఛను పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ వంటి హామీలు నెరవేర్చారన్నారు. నిమ్మక జయకృష్ణ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ బీసీ సెల్ కన్వీనర్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, నిమ్మక పాండురంగారావు, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, గుణుపూరు వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనాయుడు చెరువు పరిశీలన

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం పట్టణ పరిధిలోని బెలగాంలో ఉన్న లక్ష్మీనాయుడు చెరువును తహసీల్దార్ ఆనంద్ మంగళవారం పరిశీలించారు. చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 24న చెరువుల పరిరక్షణ సంఘం నాయకుడు వంగల దాలినాయుడు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపపత్రం అందించారు. దీనిపై కలెక్టర్ నిశాంత్‌కుమార్ స్పందించి దర్యాప్తు నిర్వహించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ రామకృష్ణ తదితరులు ఆ ప్రాంతానికి వెళ్లి చెరువు గర్భం విస్తీర్ణం తదితర వాటిని పరిశీలించారు. ఈ చెరువు ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు వైసీపీ ప్రభుత్వ కాలంలో ఆ పార్టీ పెద్దలు కొంతమంది తెరవెనుక ఉండి అక్రమ కట్టడాలను ప్రోత్సహించారని ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తే మరిన్ని అక్రమాలు బహిర్గతమయ్యే పరిస్థితి ఉంటుంది.

'వెలుగు'ను ప్రక్షాళన చేస్తాం: ఎంపీపీ సురేష్

జియ్యమ్మవలస: వెలుగు విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తామని మండల పరిషత్ అధ్యక్షులు బొంగు సురేష్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో వెలుగు అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మాకు ఎవరూ ఏమీ చేయలేరని నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి జాబితా మా వద్ద ఉంది. ఇది మా ఎన్‌డీఏ ప్రభుత్వం. వచ్చే సోమవారంలోగా వారికి వారే వచ్చి రాజీనామా లేఖ నా వద్ద ఉంచాలి. లేదంటే బలవంతంగా తొలగించి వారి స్థానంలో కొత్త వారిని నియమించడం తథ్యమ'ని చెప్పారు. గత ఐదేళ్లుగా కేవలం వైసీపీ కార్యకర్తలుగానే పనిచేశారు తప్ప నిబంధనలు ఏనాడైనా పాటించారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ వెంకటరమణ తీరుపై ఎంపీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాటలకు రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ ఏకీభవిస్తూ కచ్చితంగా ఇటువంటి వారిని తొలగించాల్సిందేనని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వీవోఏలుగా ఉన్న పురుషులను పూర్తిగా తొలగిస్తామని ఎంపీపీ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎం.నాగభూషణరావు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.



వీవోఏల జాబితాను సభలో వివరిస్తున్న ఏపీఎం నాగభూషణరావు

వైద్య పరికరాల వితరణ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక గిరిజన యువత శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతిగృహంలో ఉంటున్న గర్భిణీలకు పండ్లు, వైద్య పరికరాలు మంగళవారం అందించారు. గరుగుబిల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, అక్షయ ఫౌండేషన్ చైర్మన్, అక్షయ కనస్ట్రక్షన్స్ అధినేత ఏగిరెడ్డి తిరుపతినాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి క ద్రక మల్లేశ్వరరావు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో గరుగుబిల్లి మండల జనసేన అధ్యక్షుడు శంకరరావు, అధికారి అనిల్, శిక్షణ కేం ద్రం మేనేజర్ అన్ను రాము, సిబ్బంది, గ్రామ యువత పాల్గొన్నారు.

గడగమ్మలో వైద్య శిబిరం

వీరఘట్టం: గడగమ్మలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో డయేరియా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. అనారోగ్యంతో ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. పంచాయతీ సెక్రటరీ ఉషారాణి, సిహెచ్‌వో ఆశాజ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా..

మంత్రి సమీక్ష రేపు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రంలో గురువారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ సమీక్షా సమావేశంలో శాఖల వారీగా సమస్యలపై చర్చించి యుద్ధ ప్రాతిపదికపై సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రాధాన్యతా ప్రకారం అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.

నేడు ఎమ్మెల్యే విజయచంద్ర రాక

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా గురువారం విజయచంద్ర తన నియోజకవర్గం పార్వతీపురానికి వస్తున్నారు. ఆయనకు స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. సీతానగరం మండలం నుంచి పార్వతీపురం లోని పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా రానున్నారు. ఈ మేరకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలీసులకు రివార్డులు

గుమ్మలక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికల్లో మంచి పనితీరు కనబరిచిన ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సబ్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్, కురుపాం సబ్ ఇన్‌స్పెక్టర్ షన్ముఖరావుకు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ రివార్డులు అందించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకుగాను అభినందించారు.

9న ప్రజా వేదిక

గరుగుబిల్లి: మండలంలో గతంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై జూలై 9న ప్రజా వేదిక నిర్వహించనున్నట్టు ఎస్ఆర్‌పీ బి.దాసు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో మాట్లాడారు. 18వ విడత పనుల తనిఖీలకు డీఆర్పీలు, వీఎస్ఏలతో కూడిన ఏడు బృందా లను నియమించామని చెప్పారు. ఈ బృందాలు సోమవారం నుంచి పనుల పరిశీలన చేస్తున్నాయని తెలిపారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు 25 పంచాయతీల్లో 728 పనులు నిర్వహించారని తెలిపారు. కూలీల వేతనాల కోసం రూ.16,57,26,271, మెటీరియల్‌కు రూ.20,04,569 చెల్లించినట్లు చెప్పారు. అలాగే పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 20 పనులకు రూ.2,33,14,298, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఆరు పనులకు రూ.18,28,550 నిధులు వ్యయం జరిగిందన్నారు. మొత్తం పనులకు సుమారు రూ.20 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనతో పాటు వేతనదారుల నుంచి సమాచారం తెలుసుకుని తదు పరి గ్రామసభలు నిర్వహణ ఉంటుందన్నారు. తనిఖీలు పక్కాగా నిర్వహించి లోపాలు ఉన్నట్లయితే అవసరమైన నివేదికలను తగు చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన చెప్పారు.

తోటపల్లి ఏపీజీవీబీ మేనేజర్‌గా రెడ్డి

గరుగుబిల్లి: తోటపల్లి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్‌గా వీవీఆర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గరుగుబిల్లి ఏపీజీవీ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్న రెడ్డిని తోటపల్లి ఏపీజీవీబీ మేనేజర్‌గా ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ద్వారా అందజేసిన రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.

సీఆర్టీలను కొనసాగించాలి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: అర్హులైన సీఆర్‌టీలు అందరినీ కొనసాగించాలని ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు ఆదివాసీ సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు మంగళవారం వినతిపత్రం అందించారు. సీఆర్‌టీల ఎంపికలో గిరిజనులకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు డి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావులు హెచ్చరించారు. చినగుడబ, ఉద్దవోలు, వల్లరిగుడబ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ పనులను వారు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధులు వ్యాపించకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయాల పరిధిలోని సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ పరిశీలనలో సర్పంచ్‌లు ఆర్.గోవిందనాయుడు, ఎం.దుర్గాప్రసాద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

పాలకొండ: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సచివాలయం ద్వారా సేవలను అందించాలని ఎంపీడీవో రామకృష్ణ కోరారు. తన కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటించాలన్నారు. ప్రజల సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు.

ఒడిశా

పాము కాటుతో బాలుడి మృతి

రాయగడ: పాము కాటుకు బాలుడు మృతి చెందిన ఘటన రాయగడ జిల్లా బిసంకటక్ పోలీసుస్టేషన్ పరిధి గుంటికల్ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటికల్ గ్రామానికి చెందిన రవిసరక కుమారుడు నాలుగేళ్ల వివేక్ సోమవారం రాత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఆ సమయంలో బాలుని చేతిపై విషసర్పం కాటు వేసింది. కొంత సమయం తర్వాత వివేక్.. తన చేయి చాలా నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు తెలిపాడు. దీంతో వారు.. వివేక్ చేయి వాచిపోయి నలుపు రంగులోకి మారడాన్ని గమనించారు. వెంటనే బిసంకటక్ ఆసుపత్రికి తరలించారు. కాటు వేసిన పామును చంపి ఆసుపత్రిలో చూపిం చారు. బాలుడు అపటికే మృతిచెందినట్లు వైద్యు లు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న బిసంకటక్ పోలీసులు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించిన అనంతరం బంధువులకు అప్పగించారు.

కాశీపూర్ సమితిలో చిన్నారులకు టీకాలు

రాయగడ: కాశీపూర్ సమితి పరిధి ముప్పదర్ గ్రామంలో డిఫ్తీరియా అనే వ్యాధి సోకి ఇటీవల ఐదుగురు చిన్నారులు మృతి చెందారు. సమీపంలోని కొరాపుట్ జిల్లా సరిహద్దు గ్రామం థాంగావ్ సమితిలో ఓ చిన్నారి మృతిచెందింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా భయాందోళన నెలకొంది. దీంతో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ముకేష్ మహలింగ ఏడు జిల్లాల అధికారులు, వైద్యా శాఖాధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. వ్యాధి నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని గ్రామాలకు వైద్య బృందాలను పంపించి చిన్నారులకు టీకాలు, మందులు అందజేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కాశీపూర్ సమితిలో పర్యటించిన ఆరోగ్య బృందాలు 617 మంది చిన్నారులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని చిన్నారుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.



టీకాలు వేసేందుకు బయలుదేరిన వైద్యబృందం